
ప్రజాశక్తి
ఆదివారం 5 మార్చి 2023 I
అల్లూరి సీతారామరాజు



చెత్తాచెదారం తరలించాలి

- అల్లూరి సంఘం మండల అధ్యక్షులు ప్రకాష్

ప్రజాశక్తి -దుంబ్రిగూడ: మండల కేంద్రంలోని డ్రైనేజీ కాలువల నుంచి బయటికి తీసిన చెత్తా చెదారాన్ని వెంటనే బయటికి తరలించాలని స్థానిక అల్లూరి సంఘం మండల అధ్యక్షులు ప్రకాష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ డ్రైనేజీల నుంచి బయటకు తీసి రోడ్డుపై పడేయడంతో రోడ్డు ఇరుకుగా ఉందని తెలిపారు. దీంతో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చెత్తా చెదారంతో దుర్గంధం వెలువడుతుందని తెలిపారు. దీంతో, ఆ మార్గం గుండా వెళుతున్న పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి బయట దూర ప్రాంతానికి తరలించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి అవస్థలు

-అలంకారప్రాయంగా సోలార్ తాగునీటి పథకం - ఊట గెడ్డ నీరే ఆధారం- పట్టించుకోని పంచాయతీ అధికారులు



గెడ్డ నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: విద్యుత్ లేని ప్రాంతాల్లో తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో గతంలో కేంద్ర ప్రభుత్వం సోలార్ నీటి పథకం ఏర్పాటు చేశారు. ఈ పథకాలు మరమ్మతుకు గురై మూడు వారాలు కావస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోక పోవడంతో ట్యాంక్, కుళాయి, ట్యాపులు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ పరిస్థితి మండలంలోని పద్మాపురం పంచాయతీ దుమ్మగూడ గ్రామంలో నెలకొంది. గ్రామంలో . సోలార్ తాగునీటి పథకం మూడు వారాల క్రితం మరమ్మతుకు గురైంది. దీంతో కుళాయిలు పని చేయక



మరమ్మతుకు నోచని సోలార్ పథకం

పోవడంతో సోలార్ ట్యాంక్ అలంకప్రాయంగా ఉంది. గ్రామంలో తీవ్రంగా మంచినీటి కొరత ఏర్పడింది. గ్రామంలో సుమారు 55 కుటుంబాలు నివస్తున్నాయి. మంచి నీరు లేక గ్రామానికి దూరంగా ఉన్న పొలం పక్కన ఉన్న ఊట నీటిని తీసుకొచ్చి తాగుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది కూడా బురదనీరు కావడంతో అనారోగ్యం బారిన పడుతున్నామని

మరమ్మతు చేపట్టాలి

దుమ్మగూడ గ్రామంలో సోలార్ నీటి పథకం మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నేత, ఉప సర్పంచ్ జన్నీ భగత్ రామ్ డిమాండ్ చేశారు. గ్రామంలో మరమ్మతుకు గురైన ట్యాంక్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామంలో గతంలో నిర్మించిన సోలార్ నీటి పథకం తాగునీటి ట్యాంక్ పూర్తిగా మరమ్మతుకు గురైందని, కొత్తగా జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా బోరు తవ్వి అర్ధాంతరంగా మధ్యలోనే పనులు ఆపేశారన్నారు. అధికారులు స్పందించి సోలార్ నీటి పథకం మరమ్మతులు చేపట్టాలని కోరారు.

జన్ని భగత్ రామ్
సిపిఎం నేత, ఉప సర్పంచ్

గ్రామస్తులు వాపోయారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సోలార్ గ్రావిటీ తాగునీటి పథకం మరమ్మతు చేపట్టి వేసవిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నీటిని పరిశీలిస్తున్న భగత్‌రామ్

అరకు, లంబసింగి పర్యాటకానికి రూ.75 కోట్లు

- కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగంలో గుర్తింపు పొందిన అరకు, లంబసింగిలకు భారత్ దర్శన్ పథకంలో భాగంగా రూ.75 కోట్లను కేంద్రం మంజూరు చేసిందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా



సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇదే పథకం కింద అన్నవరం, శ్రీశైలం, అమరావతి ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో కూడా అల్లూరి 125వ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజమండ్రిలో సంగీత నాటక అకాడమీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎపిలో కుటుంబ రాజకీయాలు ప్రజలకు నష్టం చేస్తున్నాయన్నారు. రాజకీయ నాయకులు అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సాగాలి తప్ప కక్ష సాధింపులు, ప్రతీకారాలతో పొద్దు పుచ్చరాదన్నారు. పర్యాటక శాఖ నుంచి ఉత్తరాంధ్ర ప్రాంతానికి భారీ పథకాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్, ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని తాంగుల గుడలో రాధాకృష్ణ దేవాలయంలో ఏకాదశి మహెూత్సవ సందర్భంగా గిరిజన మహిళా సంఘం అద్వర్యంలో థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం తాంగులగూడ, శరభగూడ దేవాలయ ఉత్సవ కమిటి సభ్యులు సహకారంతో ఐద్వా మహిళ సంఘం రాష్ట్ర నాయకురాలు వివి జయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా మహిళ సంఘం రాష్ట్ర నాయకురాలు వివి జయ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో గతంలో ఉన్న గిరిజన సంస్కతిని గుర్తు చేసుకునేందుకు ఇటువంటి కళా నృత్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకుగాను సుమారు నెల రోజులు నుండి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ పెద్దలు తాంగుల హరి, కోర్ర మగ్గన్న, కిల్లో జగనాధం, కమిటీ సభ్యులు, మహిళా కమిటీ నాయకులు నిర్మల, కొసల్య, మొనిమ, రాధ, భవాని, అరుణ పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఒకే సిలబస్

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్
- మండలంలో సుడిగాలి పర్యటన
- పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి మారేడుమిల్లి

రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో ఒకే విధమైన సిలబస్ ప్రవేశపెట్టడం జరిగిందని ఏపి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం మారేడుమిల్లి మండలంలోని ఆయన విస్తృతంగా పర్యటించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, కస్తూరిబా బాలికలస్కూలు, పందిరి మామిడికోట మండల పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఏజెన్సీలోని విద్యార్థులకు నష్టం జరగకుండా విద్యాభివృద్ధి చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పాలన్నారు. మండల పరిషత్తు పాఠశాలల్లో ఎంఇఒ తరచూ పర్యవేక్షించాలని సూచించారు. కస్తూరాబా పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నదీ లేనిది ఆరా తీశారు. గతేడాది జూని నుండి ఇంగ్లీష్ సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లేరని తెలియజేయగా, వెంటనే ఆయన సంబంధిత అధికారితో మాట్లాడి ఉపాధ్యాయుని నియమించాలని ఆదేశించారు. ఆరు నుండి పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పందిరి మామిడి కోట పాఠశాలలో యూనిట్లు సరిగా నిర్వహించకపోవడంపైనా, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన గుడ్లు నిల్వ ఉండడంపై ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఇఒ సరిగా పర్యవేక్షణ చేయకపోవడంపై ఆయన్ను ప్రశ్నించారు. ఎంఇఒ ఎప్పటికప్పుడు అన్ని స్కూళ్లను పర్యవేక్షించి తప్పు చేసిన వారిపై జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదికల సమర్పించాలని, డిఇఒ కూడా అన్ని మండలాల్లోని స్కూళ్లను ఎప్పటికప్పుడు పరివేక్షించి సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏపీఓ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారదా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, సూపరింటెండెంట్ ఇంజినీర్ నరసింహమూర్తి, జిసిడిఓ సూర్య కుమారి, డివిఇఓ ఎన్.బెన్న స్వామి, ఎడబ్ల్యుఓ రామ తులసి, ఎంఇఒలు తాతబ్బాయి దొర, మడకం సత్యనారాయణ దొర, ఏపీఇడబ్ల్యుఐడిసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ. మారేడుమిల్లి ప్రధానోపాధ్యాయులు బిఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెన్యువల్‌కు 12 వరకూ గడువు

ప్రజాశక్తి పాడేరు:

భారత ప్రభుత్వ, మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ (న్యూఢిల్లీ)2022-23 వ సంవత్సరమునకు సంబంధించిన గిరిజన సంక్షేమ ప్రాజెక్టులు, పథకములు చేపట్టబడుతున్న ప్రభుత్వేతర సంస్థలు (ఎన్ జి ఓ) స్వచ్ఛంద సంస్థలు (వివో) లకు గ్రాంట్-ఇన్ -ఎయిడ్ కింద నిధులు మంజూరుకు గాను రెన్యువల్ ప్రతిపాదనలు కోరినట్లు అల్లూరి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు సూచించారు. ఈ మేరకు సంభందిత ప్రభుత్వేతర సంస్థలు. స్వచ్ఛంద సంస్థల నుండి నూతన రెన్యూవల్ ప్రతిపాదనలను సమర్పించుటకు ఈనెల 12 వరకు గడువు ఉందని శనివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ ప్రతిపాదనలకు నూతన మార్గదర్శకములు ఏర్పాటు చేసి 2022-23 నుండి 2025-26 వరకు అమలులో ఉంటాయని తెలియ చేశారు. ఇందులో ముఖ్యముగా గిరిజనుల అభివృద్ధికి చేపట్టబడుచున్న విద్యా వైద్య, జీవనోపాది ప్రాజెక్టులను పథకములకు ఆర్థిక సహాయం చేయుటకు అవకాశము కలదని తెలిపారు. ఈ ప్రతిపాదనలు ఆన్లైన్ ద్వారా మాత్రమే సమర్పిం చాలని వెల్లడించారు. ఆన్‌లైన్ చేసిన ధరఖాస్తు కాపీల ప్రతులకు పూర్తి ఆధారములు జతపరిచి పాడేరులో ఉపసంచాలకుల కార్యాలయంలో అందజేయాని తెలిపారు.

మావోయిస్టుల లేఖ కలకలం

ప్రజాశక్తి- జి.మాడుగుల:ఈనెల 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని పురష్కరించుకుని మావోయిస్టు ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పేరిట శనివారం లేఖ విడుదల చేశారు. మండల కేంద్రంలో లేఖ విడుదలతో కల కలం నెలకొంది. ఆ లేఖలోని వివరాలు... వాకపల్లి గ్రామంపై 2008లో గ్రేహౌండ్స్ బలగాలు దాడి చేసి, 11 మంది ఆదివాసీ మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. 2009లో ముంచింగిపుట్ మండలం. బల్లుగూడ గ్రామంపై దాడి చేసి, నలుగురు ఆదివాసీ మహిళలపై అత్యాచారం చేసారు. ఈ సంఘటనలపై దేశవ్యాప్తంగా ఆదివాసీలు, మహిళలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు ఆందోళనలు చేసారు. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించారు. సంవత్సరాలు గడిచినా నేటికీ విచారణ జరిపి దోషులను శిక్షించిన దాఖలాలు లేవని ఆ లేఖలో పేర్కొన్నారు. 2019లో ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లా కుందిలి వద్ద మైనర్ బాలిక దళిత విద్యార్థినిపై సాయుధ బలగాలు సామూహికంగా అత్యాచారానికి పాల్పడ్డారు. దీనిపై కూడా పెద్ద ఎత్తున ప్రజాందోళన జరిగాయి. బాధిత మైనర్ బాలికకు న్యాయం జరగకపోగా, చివరికి ఆ మైనర్ బాలిక పోలీసుల వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రీ సర్వేలో సమస్యలను పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరుగుతున్న జగనన్న భూహక్కు, భూరక్షా పథకంలో భాగంగా రీ సర్వేలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో రీసర్వే నోడల్ ఆఫీసర్స్ తహసిల్దార్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రీ సర్వే లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటిని అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలను విస్తతంగా చర్చించి దిశా నిర్దేశం చేశారు. సమస్యలకు సరైన మార్గాలను చూపుతూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తహసిల్దార్ కార్యాలయంలో రీసర్వే రికార్డులను భద్రపరుచాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అందుకు అవసరమైన బీరువాలను ఏర్పాటు చేయాలని జారీ చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఓ రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలక్టర్ వి. అభిషేక్‌లకు రీసర్వే వేగవంతంపై తగిన సూచనలు అందజేశారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పి.అంబేద్కర్, తహసిల్దార్లు పాల్గొన్నారు.

6న అభినందన సభ

ప్రజాశక్తి-పాడేరు:ఇటీవల రాష్ట్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జిఎఫ్ఐ) ప్రప్రదమంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన గిరిజన క్రీడాకారులకు పాడేరు కలెక్టరేట్లో ఈ నెల 6న అభినందన సభ నిర్వహిస్తున్నట్లు అల్లూరి జిల్లా ఎస్జిఎఫ్ఐ కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ పి.సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు క్రీడల్లో గిరిజన క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారన్నారు. రాష్ట్రస్థాయిలో 41 మంది, జాతీయ స్థాయిలో 18 మంది పలు క్రీడల్లో గెలుపొందారని, వీరిని సత్కరించేందుకు ఏర్పాటు చేస్తున్న అభినందన సభకు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ హాజరవుతారన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి- చింతూరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం బీరబోయిన దిలీప్ అధ్యక్షతన జరిగిన సిఐటియు మండల కమిటీ సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అదాని, అంబాని వంటి కార్పొరేట్ల సేవలో మునిగి కార్మికులు, రైతులు, ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం ప్రసాదించిన కనీస ప్రజాస్వామ్య హక్కులను కాలారాస్తూ, అదేమని ప్రశ్నిస్తే వారిని జైలుకు పంపిస్తుందని తెలిపారు. తన ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురు తిరగకుండా మతం పేరుతో ప్రజలను విడగొట్టే పాలిస్తోందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

మోడీ ప్రభుత్వ బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకంగానూ, ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడుదారులకు అనుకూలంగానూ ఉందన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రజా అనుకూల విధానాల కోసం జరుగు చలో ఢిల్లీలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు సవలం వెంకటరమణ, కార్యదర్శి పోడియం లక్ష్మణ్, కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, దారేశ్వరి, వీరమ్మ, పుష్ప, శ్రీదేవి, ముత్తమ్మ, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి పవర్ కెనాల్ పరిశీలన



రెగ్యులేటరీ డ్యామ్‌ను పరిశీలిస్తూ ఇంజినీర్లకు సూచనలిస్తున్న రిటైర్డ్ ఎస్ఇ కోటేశ్వరరావు

ప్రజాశక్తి -సీలేరు

డొంకరాయి పవర్ కెనాల్, సీలేరు జలాశయాలను ఏపీ జెన్కో రిటైర్డ్ ఎస్ఇ (సివిల్) కె.కోటేశ్వరరావు శనివారం సందర్శించారు. ముందుగా దిగువ సీలేరు డొంకరాయి పవర్ కెనాల్, రిజర్వాయర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సీలేరు చేరుకొని మెయిన్ డ్యాం, రెగ్యురేటరీ డ్యాంను పరిశీలించారు. కోటేశ్వరరావు 1970-80 మధ్య కాలంలో సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయిలో జూనియర్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన విధి నిర్వహణలో ఉన్నప్పుడే డొంకరాయి పవర్ కెనాల్, రిజర్వాయర్ నిర్మాణాలు జరిగాయి. ఈ క్రమంలో శనివారం ఆయన వీటిని పరిశీలించి గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కెనాల్ లీకేజీలు జరిగితే ఏలా అరికట్టాలి, గ్రౌటింగ్ ఏ విధంగా చేయాలి అనే అంశాలను క్షుణ్ణంగా ఇంజనీర్లకు వివరించారు. పవర్ కెనాల్‌కు ముప్పు ఏర్పడితే అత్యవసర సమయాల్లో పనులు ఏ విధంగా చేపట్టాలి, కార్యాచరణ ఏవిధంగా రూపొందించాలి అనే అంశాలను వెల్లడించారు. గుంటవాడ రిజర్వాయర్ రెగ్యురేటరీ డ్యాంను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈ బాబురావు, ఇన్‌ఛార్జి ఏడిఈ టెక్నికల్ కృష్ణారావు, ఏడిఈ క్యాంపు అప్పలనాయుడు, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జియో లాజికల్ టెక్నికల్ బృందం పరిశీలన

డొంకరాయి పవర్ కెనాల్‌ను జియో లాజికల్ టెక్నికల్ కన్సల్టెంట్ బృందం శుక్రవారం ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ ఇంజనీర్లతో కలిసి పరిశీలించారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటిని సరఫరా చేసే డొంకరాయి పవర్ కెనాల్‌కు గతేడాది డిసెంబరు 14 అర్ధరాత్రి గండి పడిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు ఏపీ జెన్కో ఉన్నతధికారులు కెనాల్ పటిష్టపై జియో లాజికల్ టెక్నికల్ నిపుణులు బృందంతో తనిఖీలు చేయాలని ఆదేశించారు. దీంతో జియోలాజికల్ టెక్నికల్ ప్రొఫెసర్ యుఎస్.రాజు బృందం డొంకరాయి నుంచి ఫోర్ బై డ్యాం వరకు ఉన్న 16 కిలోమీటర్లు మేరకు పవర్ కెనాల్‌ను పరిశీలించారు. పవర్ కెనాల్‌కు గండి పడకుండా తీసుకోవలసిన చర్యలపై బృందం జెన్కో అధికారులకు పలు సూచనలు చేశారు. మరమ్మతు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీరు బి.శ్రీధర్, ఎస్ఈ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్, ఇన్చార్జి ఎస్ఇ బాలకృష్ణ, ఈఈలు బాబురావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బిసి కాలనీ ప్రజలు

ముంపు గ్రామాలపై అశ్రద్ధ తగదు

తహశీల్దారు కార్యాలయం ఎదుట బిసి కాలనీ వాసుల ఆందోళన

ప్రజాశక్తి -విఆర్.పురం

మండలంలోని ముంపు గ్రామాలపై ప్రభుత్వానికి అశ్రద్ధ తగదని బాధితులు మండిపడ్డారు. స్థానిక బిసి కాలనీ ప్రజలు శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ 2022 సంవత్సరంలో వచ్చిన గోదావరి వరదల్లో గృహాలు ముంపునకు గురై సర్వం కోల్పోయామని తెలిపారు. 41.5 కాంటూర్‌లో బిసి కాలనీని చేర్చి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది వచ్చే వరదలకు పూర్తిగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక తహశీల్దార్ ఎన్.శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాశిత లబ్ధిదారుల వివరాలను పైస్థాయి అధికారులకు తెలియజేసి న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

గ్యాస్ ధర పెంపుపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కూనవరం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరలను భారీగా పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ 2014లో మోడీ ప్రభుత్వం వచ్చే నాటికి వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.470 ఉండగా, నేడు రూ.1150కి చేరిందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వానికి చరమ గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు తాళ్లూరి శ్రీనివాసరావు, కొండా వెంకన్నబాబు, రమేష్, యూసఫ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు



దీక్షలో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు, పోరాట కమిటీ నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి-ఉక్కునగరం : త్యాగాలు, బలిదానాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టంచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 751వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ టిపిపి, ఆర్ఇడి, పిఇఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ, విదేశీ పెట్టుబడులు ఆహ్వానించదగ్గవే అయినా 32 మంది త్యాగాలు, బలిదానాలతో సాధించిన, రూ.లక్షల కోట్ల ఆస్తులు కలిగిన స్టీల్‌ప్లాంట్‌ను వదులుకోవాల్సిన అవసరం ఉందా?, పూర్తిస్థాయి ఉత్పత్తి దిశగా ప్లాంటును నడిపిస్తే వేలాది ఉద్యోగాలు ఇవ్వచ్చన్న సంగతి మీకు తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి విశాఖ ఉక్కును నష్టాలు బారిన నెట్టకుండా ఆపాలని, ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, ఏళ్ల తరబడి ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, సొంతగనులు కేటాయించాలని, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బకొట్టి మానసిక ధైర్యాన్ని దెబ్బతీస్తున్న యాజమాన్యం పోకడలను నిలువరించే విధంగా కేంద్రంపై ఒత్తిడి చెయ్యాలని డిమాండ్‌చేశారు. ఈ దీక్షా శిబిరంలో పోరాట కమిటీ సభ్యులు వరసాల శ్రీనివాసరావు, బొడ్డు పైడిరాజు, ఎన్.రామారావు, సిహెచ్.సన్యాసిరావు, డి.శ్రీనివాస్, బి.అప్పారావు, మొల్లి వెంకటరమణ, కోరి అవతారం, జగ్గారావు మంత్రి గోపి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రి బొత్సకు వినతి

ప్రజాశక్తి-గాజువాక, విశాఖపట్నం : ప్రయివేటు పాఠశాలల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇస్తున్న మాదిరిగానే నర్సరీ నుంచి యుకెజికి కూడా పర్మిషన్ ఇవ్వాలని, విద్యా హక్కు చట్టం ద్వారా ఇచ్చే 25 శాతం ఫ్రీ సీట్ల విషయంలో ప్రభుత్వం ప్రకటించే ఫీజు సరిపోదని, దాన్ని పెంచాలని, పదో తరగతి సైన్స్ పరీక్షలో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, పాఠశాలలకు పదేళ్ల కాలానికి గుర్తింపు ఇవ్వాలని వినతిలో కోరారు. వీటిపై మంత్రి బొత్స సత్యనారాయణ స్పందిస్తూ నర్సరీ నుంచి యుకెజి పర్మిషన్‌కు డిఇఒ స్థాయిలో పర్మిషన్ ఇచ్చేలా చూస్తానని, గుర్తింపు ఐదేళ్ల కాలానికి ఇస్తామని, పాఠ్య పుస్తకాలకు ఇండెంట్ పెట్టకుండా అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, విశాఖ జిల్లా అధ్యక్షులు జె.సోమశేఖర్, జిప్సా అధ్యక్షుడు భాస్కరరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్, బి.శ్రీనివాస్, మురళిసుందర్, గణపతిరావు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో స్వీకరించాలి

ప్రజాశక్తి-కంచరపాలెం : హయ్యర్ పెన్షన్ దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో కూడా అనుమతించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్‌చేసింది. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశంలో శనివారం హష్మీ భవన్‌లో నిర్వహించారు. పలు అంశాలను చర్చించి తీర్మానాలు చేశారు. ప్రధానంగా సుప్రీంకోర్టు తీర్పు వల్ల, ఇపిఎఫ్ సర్క్యులర్ వల్ల వచ్చిన గందరగోళం నివారించాలని, గ్యాస్ ధరను తగ్గించాలని, జివిఎంసి ఇంటి పన్నుతో పాటు చెత్త పన్ను వసూలు చేయడం ఆపాలని తీర్మానించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను అసోసియేషన్ మెంబర్స్ అందరూ బలపరచి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, ఆమె గెలుపునకు కృషి చేయాలని నిర్ణయించారు.

కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్ సిఐటియు నాయకులు అయోధ్యరామ్



ఆరిలోవలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం :

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యాన శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేపట్టారు.

ఆరిలోవ : ఉత్తరాంధ్ర సమస్యలపై మంచి పట్టు ఉండి, ప్రజా గొంతును వినిపించే డాక్టర్ కోరెడ్ల రమాప్రభను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ శనివారం సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. 13వ వార్డు పరిధి పైనాపిల్ కాలనీ, ఎస్ఎస్ఎన్ నగర్, రామకృష్ణాపురంలో పట్టభద్రుల ఓటర్ల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేస్తూ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.నరేంద్రకుమార్, ఐసి.నాయుడు, వి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం: డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ అధ్యక్షతన ప్లాంట్‌లోని సిఎంఎస్ గేథరింగ్ పాయింట్ వద్ద ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు తమ రాజకీయ అవసరాల కోసం పరిమితంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటానికి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. పోస్కోకు వ్యతిరేకంగా చలో అమరావతి పేరుతో సుమారు 2000 మంది ఉక్కు కార్మికులు ధర్నా నిర్వహిస్తే స్థానిక శాసన సభ్యులు, స్థానిక శాసనమండలి సభ్యులు పాల్గొనలేదని, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రం నేరుగా అసెంబ్లీ నుంచి విచ్చేసి తమ సంఘీభావాన్ని తెలియజేశారని గుర్తు చేశారు. కనుక స్టీల్‌ప్లాంట్‌కు కష్టం వస్తే కార్మికులతో కలిసి ఉద్యమాలతో ప్రభుత్వంపై ఒత్తిడి చేసే అభ్యర్థులను గెలిపించుకోవడం మనందరి ప్రధాన కర్తవ్యం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరాజు, నాయకులు డి.కృష్ణమూర్తి, నీలకంఠం, యు.వెంకటేశ్వర్లు, కెవి.సత్యనారాయణ, మొహిద్దీన్, సూర్యనారాయణ, డి.సత్యనారాయణ, డిఎస్ఆర్‌సి.మూర్తి, వీరాస్వామి, రాజు, శ్రీరామచంద్రమూర్తి, డి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ శనివారం అచ్యుతాపురంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, మండల కార్యదర్శి కె సోమినాయుడు ప్రమాచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు తొలి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

ముంచింగిపుట్టు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నర్సయ్య ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో శనివారం గిరిజన సంఘం, భాష వాలంటీర్ల సంఘం నాయకులు, యువతతో కలిసి పిడిఎఫ్ అభ్యర్థి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం కె.నర్సయ్య, మండల వైస్ ఎంపిపి-1 పి.సత్యనారాయణ లు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై శాసన మండలిలో గొంతు వినిపించాలంటే 250 ప్రజా సంఘాలు బలపర్చిన కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ఆమె పోరాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మిపురం సర్పంచ్ కె.త్రినాధ్, గిరిజన సంఘం నాయకులు పి.భీమరాజు, పి.రాందాస్, దోంబ్రు, బాషా వాలంటీర్లు కొండయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

మాకవరపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల పీడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా మండలంలోని కొండల అగ్రహారంలో బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా నాగరాజు ప్రచారం చేశారు. కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షాన ప్రశ్నించే వ్యక్తినే పార్టీలకు అతీతంగా ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ అప్పలనాయుడు, చందర్రావు, ప్రసాదు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో ప్రచారంలో పాల్గొన్న నాయకులు




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజనసంఘం నాయకులు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడాలి

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ స్వతంత్రత ఆయువుపట్టు అని, దాన్ని కాపాడుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 'భారత న్యాయవ్యవస్థ స్వతంత్రత -సవాళ్లు' అనే అంశంపై ఐలు రాష్ట్ర కమిటీ, విశాఖపట్నం జిల్లా కమిటీల ఆధ్వర్యాన శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన్ కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడటంలో ప్రజాసంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు తమవంతు పాత్ర పోషించాలన్నారు. సమావేశానికి విశిష్ట అతిథిగా విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవివిఎస్.శర్మ, ఐలు విశాఖ కమిటీ అధ్యక్షులు బివి.రామాంజనేయరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.ఆనందరెడ్డి, నూకల వెంకటేశ్వరరావు, భగత్ తులసీదాస్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ కోరెడ్ల రమాప్రభ తదితరులు ప్రసంగించారు. ఇటీవల కేంద్ర న్యాయశాఖ మంత్రి, ఉప రాష్ట్రపతి కొలీజియం ఉద్దేశించి అనేక అంశాలపై ప్రతిపాదించడం తీవ్ర గర్హనీయమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు హైకోర్టు న్యాయమూర్తుల నియామకం కొలీజియం కాకుండా ప్రభుత్వం జోక్యం చేసుకుంటే భారత న్యాయ వ్యవస్థ స్వతంత్రత దెబ్బతిని ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ప్రతినిధులు ముక్తకంఠంతో ఉద్ఘటించారు. ఉద్యోగ విరమణ పొందిన న్యాయమూర్తులకు పదవులు ఇవ్వడం వంటివి కూడా స్వతంత్రతను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖపట్నం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి సోమయాజులు

శక్తివంతమైనది న్యాయవ్యవస్థ

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యాంగంలో న్యాయవ్యవస్థ ఎంతో శక్తివంతమైనదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు అన్నారు. పౌర గ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యాన శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం అన్నిటికన్నా బలమైనదన్నారు. న్యాయ సమీక్ష గురించి పలువులు న్యాయవాదులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. అనేక కీలక అంశాల్లో న్యాయవ్యవస్థ తీర్పులను ప్రస్తావించి సహజ న్యాయం అనే భావనను తెలియజేశారు. కొన్ని రాజ్యాంగ సవరణలను ఉదహరించారు. ప్రాథమిక హక్కులు రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమన్నారు. బ్యాంకుల జాతీయకరణ, భారత ఉదాంతం తదితర విషయాల్లో రాజ్యాంగ చట్టాలు, న్యాయనిపుణులు వ్యాఖ్యానించిన తీరుతెన్నులను ప్రస్తావించారు. గౌరవ అతిథి ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు మాట్లాడుతూ, న్యాయవ్యవస్థ గమనాన్ని క్షుణ్ణంగా వివరించారు. రాజ్యాంగ నియంత్రణలో శాసన, కార్యనిర్వహాక, న్యాయవ్యవస్థలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శి డిఎస్.వర్మ, న్యాయవాదులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి చీడిపల్లి ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి పిహెచ్‌సిల పరిధిలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు వద్ద ఉన్న ఇళ్ళ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో డ్రమ్ములు, టబ్‌లు, ప్లాస్టిక్ పేపర్లు ఉంచడం వలన వాటిలో నీరు చేరి దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా దోమతెరలు ఉపయోగించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

బహుభాషా విద్య అమలుపై శిక్షణ

ప్రజాశక్తి - చింతూరు : మాతృభాష ఆధారిత బహుభాషా విద్య అమలుపై ఐటీడీఏ ఏపీవో కె.సుజాత ఆధ్వర్యంలో స్థానిక ఏపీఆర్ స్కూల్ ఆవరణలో శనివారం శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో పిల్లలకు విద్యను అందించడం చాలా సులువుగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో భాషను వాడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజకుమార్, ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థ పర్యవేక్షణలో బీచ్ రోడ్‌లోగల బ్రిడ్జి స్కూల్ ఆవరణలో మహిళలకు స్వయం ఉపాధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొవ్వొత్తుల తయారీ, పినాయల్, సర్ఫ్ తయారీలో ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. అందుకు ఇటువంటి స్వల్పకాలిక శిక్షణలు తోడ్పడతాయని తెలిపారు. ఇక్కడ తయారైన వస్తువులను సగం ధరకే విక్రయిస్తున్నట్టు తెలిపారు.

నేటి నుంచి అచ్యుతరామరాజు శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరానికి చెందిన ప్రముఖ రచయిత, నటుడు, దర్శకుడు, కళా ప్రపూర్ణ, కీర్తిశేషులు గణపతిరాజు అచ్యుతరామరాజు శత జయంతి వేడుకలను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు అచ్యుతరామరాజు స్మారక సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మత్స జగన్నాథరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9:30 గంటలకు డాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ ప్రారంభ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతం.. ఉపాధి కల్పన

పెట్టుబడుల సదస్సు లక్ష్యమిదే : సిఎం జగన్, మంత్రి అమర్‌నాథ్
ప్రభుత్వంపై నమ్మకంతోనే పెట్టుబడులు వచ్చాయని ఉద్ఘాటన
రెండో రోజు రూ.1.17 లక్షల కోట్లతో 260 ఎంఒయులు
విశాఖలో ముగిసిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023



సమ్మిట్ ముగింపులో మాట్లాడుతున్న సిఎం జగన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహించామని సిఎం జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే ప్రపంచం నలుమూలల నుంచీ పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారని పేర్కొన్నారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఈ నెల 3న ప్రారంభమైన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023' శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో తొలుత సిఎం మాట్లాడుతూ రెండు రోజులూ కలిపి రూ.13 లక్షల కోట్ల ఎంఒయులపై సంతకాలు జరిగాయన్నారు. రెండో రోజు 1.17 లక్షల కోట్లతో 260 ఒప్పందాలు చేసుకున్నామని, తద్వారా 30,787 మందికి ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం కాబోతుందని తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ విజయవంతమైనట్టు ప్రకటించారు. అనంతరం రూ.3841 కోట్ల విలువైన 14 పారిశ్రామిక యూనిట్లను సిఎం సమ్మిట్ వేదికపై పారిశ్రామిక ప్రతినిధుల సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. దీని వల్ల 9108 మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. సమ్మిట్‌లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శర్బానంద్ సోనోవాల్ పాల్గొన్నారు. ఎపికి కేంద్రం సహకారం నిరంతరం ఉంటుందన్నారు.

సదస్సు ముగింపు సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ సమ్మిట్‌తో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించామన్నారు. ప్రతి ఒప్పందాన్నీ ఆచరణాత్మకంగా అమలు చేసి సత్ఫలితాలు సాధిస్తామని, వాటి ద్వారా అందే ప్రయోజనాలను రాష్ట్ర ప్రజలకు అందిస్తామని తెలిపారు. ప్రధానంగా 14 రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానించామని, దీనికి అన్ని దేశాల నుంచి ఆశించిన మేర స్పందన వచ్చిందని పేర్కొన్నారు. ఇయు కూటమి దేశాల నుంచి అధిక సంఖ్యలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చారని గుర్తు చేశారు. యుఎఇ, నెదర్లాండ్స్, వియత్నాం, ఆస్ట్రేలియా దేశాల మొదలు మొత్తం 40 దేశాలకు చెందిన 595 మంది ప్రతినిధులు పరోక్షంగా పాల్గొన్నారని చెప్పారు. సదస్సు నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నామని, తీవ్ర కృషి చేశామని, దీనికి తగిన ఫలితం దక్కిందని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, పారిశ్రామికవేత్తల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని ప్రజాప్రయోజన కార్యక్రమాలు నిర్వహిస్తామని, వీలైనంత త్వరగా నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలెవన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన, సమాచార శాఖ కమిషనర్ టి.విజయ్ కుమార్ రెడ్డి ఉన్నారు.



ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

రెండో రోజు తగ్గిన వ్యాపారవేత్తల హాజరు

రెండో రోజు సమ్మిట్‌లో వ్యాపారవేత్తలు కరువయ్యారు. మొదటి రోజు కనిపించిన హడావుడి రెండో రోజు లేదు. ప్రధాన గ్యాలరీలోని సీట్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. సచివాలయం వాలంటీర్లు, విద్యార్థులు, ఉద్యోగులతో మిగిలిన సీట్లను నిర్వాహకులు నింపేశారని కొందరు ప్రతినిధులు బాహటంగానే చెప్పారు.

పలు అంశాలపై సెమినార్లు

రెండో రోజు పలు అంశాలపై సెమినార్లు నిర్వహించారు. పెట్రోలియం అండ్ ఫార్మాస్యూటికల్స్, హయ్యర్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, టెక్స్‌టైల్ అండ్ అపెరల్స్‌తోపాటు వెస్టర్న్ ఆస్ట్రేలియా వంటి కంట్రీ సెషన్స్ కూడా నడిచాయి.

కళకళలాడిన ఎపి పెవిలియన్ స్టాల్స్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన స్టాళ్లను వీక్షించడానికి వ్యాపారవేత్తలు, విద్యార్థులు ఆసక్తి చూపించారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్, శ్రీ సిటీ, హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్, మోరి టెక్, సిఐఐ ఇన్నైడర్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, ఆప్కో హ్యాండ్లూమ్స్, లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డ్, జిసిసి స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

అప్రమత్తమైన అధికారులు

తొలిరోజు జరిగిన అనుకోని సంఘటనల దృష్ట్యా పోలీస్ యంత్రాంగం రెండో రోజు అప్రమత్తమైంది. తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. భోజన ఏర్పాట్లు సజావుగా ఉండేలా నిర్వాహకులు చూశారు.

పారిశ్రామిక ప్రదర్శనను తిలకించిన బుగ్గన

రాష్ట్ర ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎపి పెవిలియన్ పారిశ్రామిక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ స్టాల్‌లో ప్రదర్శించిన పలు యుద్ధ హెలీకాప్టర్లను పరిశీలించారు. సంస్థ కార్యక్రమాలు, సైనిక దళాల అవసరాల కోసం తమ సంస్థ చేస్తున్న కృషిని జనరల్ మేనేజర్ అరుణ్ జే సర్కటే మంత్రికి వివరించారు. హెచ్ఎఎల్ సంస్థ తరుపున జ్ఞాపికను అందజేశారు. శ్రీ సిటీ స్టాల్‌లో అక్కడ తయారవుతున్న పారిశ్రామిక ఉత్పత్తులపై ఎమ్‌డి రవి సన్నారెడ్డి ఆర్థిక మంత్రికి వివరించారు.



హాల్ టిక్కెట్లు చేబూని హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షా కేంద్రం మంజూరుపై హర్షం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇంటర్ పరీక్ష కేంద్రం మంజూరు చేయడంపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ బాబు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేయగా, వాటిని విద్యార్థులు ప్రదర్శించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలు నుంచి సీలేరు కళాశాల విద్యార్థులు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న జీకే.వీధి వెళ్లి పరీక్షలు రాసేందుకు అనేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సీలేరులో ఇంటర్ పరీక్ష కేంద్రం మంజూరుకు కృషి చేసిన అధికారులకు, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి ఇంటర్ పరీక్షల్లో పూర్తిస్థాయి ఉత్తీర్ణత సాధించి కళాశాల ఖ్యాతి నిలపాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని ప్రిన్సిపాల్ తెలిపారు.

శ్రీనివాసరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కూనవరం : మండలంలోని గొమ్ము అయ్యవారిగూడెంకు చెందిన సిపిఎం సభ్యుడు అరవ శ్రీనివాసరావు కుటుంబాన్ని సిపిఎం మండల నాయకులు శుక్రవారం పరామర్శించారు. శ్రీనివాసరావు కుమారుడు అరవ నరేంద్ర కుమార్ (24) హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి మృతి చెందాడు. శుక్రవారం నరేంద్ర కుమార్ అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, మాజీ ఎంపిటిసి మేకల నాగేశ్వరరావు, నాయకులు శ్యామల కృష్ణ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

ఘనంగా ఉమామహేశ్వరి కల్యాణోత్సవం

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం సీలేరు శివాలయంలో ఉమామహేశ్వరి కళ్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న దంపతులకు ఆలయ కమిటీ భోజన ఫలహారాలు అందజేసింది. ఆలయంలో భక్తుల శివనామస్మరణ మారమోగింది.

ఉత్సాహంగా చెస్ పోటీల ఎంపికలు

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-13 ఎంపికలు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో శనివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. బాలురు విభాగంలో రమణ సిద్ధార్థ, పృథ్వీ కృష్ణ, బాలికల విభాగంలో గొర్లి నైనా, దివ్యదర్శిని మొదటి, రెండో స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరు అండర్-13 రాష్ట్ర స్థాయి పోటీలకు విశాఖ జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని అసోసియేషన్ సభ్యులు బాబూరావు, మణికంఠ, శ్రీకాంత్ తెలిపారు.

11న నూతన చిత్రానికి నటీనటుల ఎంపిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ : న్యూస్ వన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న నూతన చిత్రానికి ఈ నెల 11న నటీనటుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు చిత్ర దర్శకులు అవినాష్ పూజారి తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగించే చిత్రం నిర్మించాలని భావించామన్నారు. ఈ క్రమంలోనే నటనపై ఆసక్తి ఉండి అవకాశాలు రాని వారికి, ప్రతిభ ఉన్నా వెలుగులోకి రాని వారికి 'న్యూస్ వన్ ఎంటర్ టైన్ మెంట్' తీయబోయే చిత్రంలో అవకాశం కల్పిస్తామన్నారు. అందుకోసం ఈ నెల 11న, అలాగే 19న విశాఖలోని దొండపర్తి వద్దగల 'న్యూస్ వన్' పత్రికా కార్యాలయంలో ఆడిషన్స్ నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తిగల కళాకారులు, సినీ రంగంపై మక్కువ ఉన్న వారు 93461 90796, 8985673325 నెంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో డైరెక్టర్ జిఎల్.జయసింహ, వై.అప్పారావు పాల్గొన్నారు.